క్లుప్తంగా

ఎన్నికల కోడ్ ఉల్లంఘనపై కేసు

గండేపల్లి: ఎన్నికల కోడ్ ఉల్లంఘనపై కేసు నమోదు చేసినట్టు స్థానిక పోలీసులు తెలిపారు. మండలంలోని మురారి శివారు చెక్ పోస్ట్ వద్ద బుధవారం ఎంసీసీ ఇన్‌చార్జ్, ఎంపీడీఓ హనుమంతరావు, సిబ్బంది వాహనాలు తనిఖీ చేపట్టారు. రాజమహేంద్రవరం వైపు నుంచి వస్తున్న కారుకు అద్దంపై కూటమి స్టిక్కర్, జనసేన పార్టీకి చెందిన గ్లాస్ గుర్తు ఉండటంతో ఎన్నికల కోడ్ ఉల్లంఘన కింద కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

చంద్రశేఖర్ నియామకంపై హర్షం


మేడిబోయిన చంద్రశేఖర్

ప్రత్తిపాడు: వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం కార్యదర్శిగా ప్రత్తిపాడు గ్రామానికి చెందిన మేడిబోయిన చంద్రశేఖర్ నియామకం కావడంపై బుధవారం పలువురు పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. పార్టీలో తనకు సముచిత స్థానం కల్పించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు, పార్టీ అధ్యక్షుడు కురసాల కన్నబాబు, ఎమ్మెల్సీ అనంత బాబుకు చంద్రశేఖర్ కృతజ్ఞతలు తెలిపారు.

వాహనాల తనిఖీ

గండేపల్లి: ఎన్నికల నేపథ్యంలో అధికారులు వాహనాల తనిఖీలను విస్తృతం చేశారు. మండలంలోని మురారి శివారులో చెక్ పోస్ట్ వద్ద బుధవారం ఫ్లయింగ్ స్క్వాడ్ ఇన్‌చార్జ్ వైడీపీ జి.భవాని వాహనాల తనిఖీ చేపట్టారు. ఒక వ్యాన్‌లో తరలిస్తున్న 75 గిఫ్ట్ బాక్సులు, 50 వాటర్ జగ్గులు, 25 హాట్ బాక్సులను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. వీటి విలువ రూ.57,125 ఉంటుందని చెప్పారు.

నేడు ఎ.కొత్తపల్లిలో మంత్రి రాజా ఎన్నికల ప్రచారం

తొండంగి: మండలంలోని ఎ.కొత్తపల్లిలో రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ తుని ఎమ్మెల్యే అభ్యర్థి దాడిశెట్టి రాజా గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగం గంగబాబు తెలిపారు. సాయంత్రం నాలుగు గంటలకు గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థిస్తారన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఆరు నామినేషన్ల దాఖలు


వైఎస్సార్ సీపీ తరఫున నామినేషన్ దాఖలు చేస్తున్న వరుపుల సూరిబాబు

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు అసెంబ్లీ స్థానానికి బుధవారం ఆరుగురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసినట్టు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ.శ్రీనివాసరావు తెలిపారు. వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా వరుపుల సుబ్బారావు తనయుడు వరుపుల వీరవెంకట సత్య సూరిబాబు, దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) అభ్యర్థిగా నేతల కొండబాబు, పిరమిడ్ ఆఫ్ ఇండియా అభ్యర్థిగా ఆశిన శ్రీనివాసు, స్వతంత్ర అభ్యర్థులుగా న్యాయవాది పిల్లి బలరాముడు, కొత్తపల్లి అర్జునరావు, సుర్ల శ్రీనివాసు నామినేషన్లు దాఖలు చేశారని వివరించారు.

తుని సెగ్మెంట్‌కు ఐదు...

తుని: తుని అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి బుధవారం ఐదుగురు నామినేషన్లు దాఖలు చేసినట్టు ఎన్నికల రిటర్నింగ్ అధికారి కేవీ రామలక్ష్మి తెలిపారు. వైఎస్సార్ సీపీ తరఫున మంత్రి దాడిశెట్టి రాజా (3), ఆయన సతీమణి దాడిశెట్టి లక్ష్మీచైతన్య (2) సెట్ల నామినేషన్ పత్రాలు దాఖలు చేశారన్నారు. కాంగ్రెస్ పార్టీ తరఫున గేలం శ్రీనివాసరావు, నూకరాజు కర్రి బహుజన సమాజ్ పార్టీ, ఆది వెంకట సత్యనారాయణ వేగి స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేశారని వివరించారు.

గొరంపేటలో ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్


గొరంపేటలో జేసీబీతో వ్యర్థాల తొలగింపు

శంఖవరం: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటారని గొరంపేట సర్పంచ్ రామిశెట్టి ఏసుబాబు అన్నారు. మండలంలోని గొరంపేటలో బుధవారం ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించారు. పంచాయతీ సిబ్బంది రోడ్లకు ఇరువైపులా ఉన్న చెత్త, వ్యర్థాలను తొలగించారు. డ్రైన్లలో పూడిక తీసి బ్లీచింగ్ చల్లారు. వీధుల్లో దోమల నివారణ మందు పిచికారీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఏసుబాబు మాట్లాడుతూ గ్రామం పరిశుభ్రతే లక్ష్యంగా అధికారులు పని చేయాలని సూచించారు.


తునిలో ఆర్వో రామలక్ష్మికి నామినేషన్ పత్రాలు అందజేస్తున్న దాడిశెట్టి రాజా


ఆర్వో కార్యాలయంలో ప్రమాణ పత్రాన్ని చదువుతున్న దాడిశెట్టి రాజా


వైఎస్సార్ సీపీ తరఫున నామినేషన్ వేస్తున్న రాజా సతీమణి లక్ష్మీచైతన్య


వి.కొత్తూరు నుంచి ర్యాలీగా వెళుతున్న పార్టీ నాయకులు, కార్యకర్తలు

నీరాజనం

- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా దాడిశెట్టి రాజా నామినేషన్ దాఖలు
- వేలాదిగా తరలివచ్చిన పార్టీశ్రేణులు, అభిమానులు
- జనసంద్రమైన తుని పట్టణం


అశేష జనవాహినితో ఊరేగింపుగా వెళుతున్న ఎమ్మెల్యే రాజా, చలమలశెట్టి సునీల్

తుని: నియోజకవర్గంలోని నలుమూలల నుంచి తరలి వచ్చిన వేలాది మంది వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు, ప్రజలతో తుని పట్టణం జనసంద్రమైంది. మండే సూర్యుడు సైతం జనాభిమానం ముందు పండువెన్నెల అయ్యాడు. అశేష జనవాహిని నడుమ బుధవారం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా దాడిశెట్టి రాజా నామినేషన్ దాఖలు చేశారు. తుని మండలంలోని ఎస్.అన్నవరం ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో దాడిశెట్టి రాజా, లక్ష్మీచైతన్య దంపతులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అక్కడ నుంచి నామినేషన్ వేసేందుకు బయలుదేరిన మంత్రి దాడిశెట్టి రాజాకు అడుగడుగునా ప్రజలు నీరాజనం పట్టారు. రెండు కిలోమీటర్లు చేరుకోవడానికి రెండున్నర గంటల సమయం పట్టింది.

పండుగ వాతావరణం

తుని పట్టణంలోని వీధులన్నీ అభిమానులు, జనంతో నిండిపోయాయి. మహిళలు దాడిశెట్టి రాజా నుదుట విజయ తిలకాన్ని దిద్ది మంగళ హారతులు పట్టారు. తీన్‌మార్, థింసా, కథకళి, మంగళ వాయిద్యాలు, కార్యకర్తల కేరింతల నడుమ సూరవరం నుంచి అశేష జనవాహిని మధ్య ప్రచార రథంలో వైఎస్సార్ సీపీ కాకినాడ ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్, తుని మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణితో కలిసి మంత్రి రాజా ఉదయం 8 గంటలకు బయలుదేరారు. కొత్తపేట లక్ష్మీగణపతి ఆలయం, ఆంజనేయస్వామి గుడకి చేరుకుని పూజలు చేశారు. అక్కడ నుంచి సూరవరం రోడ్డు, బాలాజీ సెంటర్, మెయిన్ రోడ్డు మీదుగా గొల్ల అప్పారావు సెంటర్‌కు చేరుకుని జీఎన్‌టీ రోడ్డు మీదుగా రాజా 10.30 గంటలకు తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. నామినేషన్ పత్రాలను ఆర్వో కేవీ రామలక్ష్మి సమర్పించారు. మంత్రి దాడిశెట్టి రాజా సతీమణి లక్ష్మీచైతన్య నామినేషన్ దాఖలు చేశారు. తుని, తొండంగి, కోటనందూరు మండలాలు, తుని పట్టణానికి చెందిన వేలాది మంది వైఎస్సార్ సీపీ అభిమానులు, కార్యకర్తలు, నాయకులు తరలి వచ్చారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో తుని ఎమ్మెల్యే అభ్యర్థి దాడిశెట్టి రాజాను గెలిపించుకుంటామని నినాదాలు చేశారు. కార్యక్రమంలో తుని నియోజకవర్గ పరిశీలకులు ఒమ్మి రఘురాం, రాష్ట్ర పెరికి కార్పొరేషన్ చైర్‌పర్సన్ పురుషోత్తం గంగాభవాని, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ మేరుగు పద్మలత, తుని పట్టణం, తుని, తొండంగి, కోటనందూరు మండలాల పార్టీ అధ్యక్షులు రేలంగి రమణాగౌడ్, దుంగల నాగేశ్వరరావు, చింతకాయల చినబాబు, గొర్లి రామచంద్రరావు, లోవ దేవస్థానం మాజీ చైర్మన్లు లాలం బాబ్జి, బొంగు ఉమారావు, యువజన విభాగం తుని నియోజకవర్గ అధ్యక్షుడు ఏలూరి బాలు, జిల్లా వక్ఫ్ బోర్డు వైస్ చైర్మన్ షేక్ ఖ్వాజా, డీసీసీడీ డైరెక్టర్ పోలిశెట్టి సోమరాజు, తాండవ సుగర్స్ మాజీ చైర్మన్ నాగం దొరబాబు, తుని, కోటనందూరు ఎంపీపీలు డాక్టర్ బొప్పన రాము, లగుడు శ్రీనివాస్, పోతల రమణ, కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

జగన్‌తోనే సంక్షేమపాలన

జననేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేస్తేనే రాష్ట్రంలో సంక్షేమపాలన కొనసాగుతుందని ఎమ్మెల్యే దాడిశెట్టి రాజా అన్నారు. నామినేషన్ దాఖలు చేసిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత చంద్రబాబుపాలనలో అవినీతి అక్రమాలు జరిగాయని, ప్రతిపక్ష నాయకులపై కేసులు పెట్టారన్నారు. వైఎస్సార్ సీపీ బలమైన శక్తిగా ఉందంటే కార్యకర్తల మనోబలమే కారణమన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై టీడీపీ నాయకులు విమర్శలు గుప్పిస్తున్నారని, వారికి త్వరలో జరిగే ఎన్నికల్లో ప్రజలే ఓటు ద్వారా బుద్ధి చెబుతారన్నారు. కాకినాడ ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్ మాట్లాడుతూ తుని ప్రజల అభిమానం ఎలా ఉంటుందో ప్రత్యక్షంగా చూశానన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో రెండు ఓట్లను ఫ్యాన్ గుర్తుపై వేసి గెలిపించాలని కోరారు. తుని నియోజకవర్గం ప్రజలు చూపించిన అభిమానాన్ని ఎన్నటికీ మరచిపోనని రాజా పేర్కొన్నారు. నామినేషన్ కార్యక్రమానికి వచ్చిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు.

నామినేషన్‌కు భారీగా తరలివెళ్లిన అభిమానులు

తుని రూరల్: రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ తుని నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి దాడిశెట్టి రాజా నామినేషన్ ర్యాలీకి బుధవారం మండలంలోని వివిధ గ్రామాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివెళ్లారు. అన్ని గ్రామాల ఆటోలు, మోటార్ సైకిళ్లపై బయలుదేరి వెళ్లారు. దీంతో గ్రామీణ రహదారుల్లో సందడి నెలకొంది. వి.కొత్తూరు నుంచి వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు దుంగల నాగేశ్వరరావు, మాజీ అధ్యక్షుడు పోతల రమణ, కొత్త సూరవరం నుంచి వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు గంటా చక్రరావు, వివిధ గ్రామాల నుంచి సర్పంచులు, ఎంపీటీసీల ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తుని తరలివెళ్లారు.

కోటనందూరు మండలం నుంచి...

కోటనందూరు: వైఎస్సార్ సీపీ తుని ఎమ్మెల్యే అభ్యర్థి దాడిశెట్టి రాజా నామినేషన్ కార్యక్రమానికి బుధవారం మండలం నుంచి వైఎస్సార్ సీపీ శ్రేణులు భారీగా తరలివెళ్లాయి. మండలంలోని 17 పంచాయతీల నుంచి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు 10 వేలకు పైగా కార్లు, ఆటోలు, బైకులపై తరలివెళ్లారు. వైఎస్సార్ సీపీ శ్రేణులతో తుని–నర్సీపట్నం రోడ్డు జనసముద్రాన్ని తలపించింది. కార్యక్రమంలో ఎంపీపీ లగుడు శ్రీనివాసు, తుని ఏఎంసీ వైస్ చైర్మన్ వెలగా వెంకటకృష్ణాజీ, సొసైటీ అధ్యక్షుడు గొర్లి రామచంద్రరావు, లోవదేవస్థానం మాజీ చైర్మన్లు లాలం బాబ్జీ, బొంగు ఉమారావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చింతకాయల చినబాబు, ఏపీబీ జిల్లా చైర్మన్ లంక ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తొండంగి మండలం నుంచి...

తొండంగి: వైఎస్సార్ సీపీ తుని ఎమ్మెల్యే అభ్యర్థిగా దాడిశెట్టి రాజా నామినేషన్ దాఖలు కార్యక్రమానికి బుధవారం తొండంగి మండలం నుంచి పార్టీ నాయకులు, అభిమానులు భారీగా తరలివెళ్లారు. తొండంగి, పి.అగ్రహారం, బెండపూడి, వేమవరం, పెరుమాళ్లపురం, శృంగవృక్షం, రావికంపాడు, అద్దరిపేట, దానవాయిపేట, గోపాలపట్నం, సీతారాంపురం, కొమ్మనాపల్లి పైడికొండ, కృష్ణాపురం, ఒంటిమామిడి, తాటియాకులపాలెం, కోదాడ, ఎ.కొత్తపల్లి, పి.ఇ.చిన్నాయపాలెం తదితర గ్రామాల నుంచి ఆటోలు, బైక్‌లు, కార్లు తదితర వాహనాలపై తుని బయలుదేరి వెళ్లారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ మేరుగు పద్మలత, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కొయ్య మురళీకృష్ణ, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగం గంగబాబు, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ గాబు రాజు, పార్టీ కన్వీనర్ బద్ది నూకరాజు, బత్తుల వీరబాబు, దడాల విజయబాబు పాల్గొన్నారు.


దాడిశెట్టి రాజా నామినేషన్‌కు కోటనందూరు నుంచి తరలివెళ్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు


తొండంగి మండలం నుంచి తుని వెళుతున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

వచ్చే ఎన్నికల్లో విజయం ఖాయం


తిరుమాలిలో ఎన్నికల ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు

- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు
- తిరుమాలిలో ఎన్నికల ప్రచారం

ఏలేశ్వరం: ప్రతిపక్ష పార్టీలు ఎన్ని కుట్రలు చేసినా, ఎంతమంది ఏకమైనా వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీదే విజయమని ఆ పార్టీ ప్రత్తిపాడు ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు అన్నారు. మండలంలోని తిరుమాలిలో బుధవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేసిన పథకాలను వివరించారు. ప్రస్తుతం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లో సీఎం జగన్‌కే మళ్లీ పట్టం కట్టాలని ప్రజలను అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీలు ప్రజలను మభ్య పెట్టేందుకు ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలితం ఉండదన్నారు. సీఎం జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేయడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. సంక్షేమ సారథి సీఎం జగన్‌కు వచ్చే ఎన్నికల్లో ఏకపక్షంగా అసెంబ్లీ సీట్లు, పార్లమెంట్ సీట్లు రావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు అడపా పార్థసారథి, సూతి ప్రసాద్, ఓలేటి చంటిబాబు, పసల నాగేశ్వరరావు, కోరుకొండ రామకృష్ణ, పసల రాంబాబు, బద్ది కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించండి

- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం కుమార్తె ప్రసన్న
- జగ్గంపేటలో ఎన్నికల ప్రచారం


ముక్కొల్లులో ఎన్నికల ప్రచారం చేస్తున్న తోట శ్రీనిధి

జగ్గంపేట: అర్హులందరికీ పథకాలు అందిస్తున్న సంక్షేమ ప్రభుత్వాన్ని వచ్చే ఎన్నికల్లో మళ్లీ గెలిపించండి అని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం కుమార్తె ప్రసన్న పిలుపునిచ్చారు. జగ్గంపేటలో బుధవారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఒమ్మి రఘురాం, ఉప సర్పంచ్ బండారు రాజా, జిల్లా వక్ఫ్‌బోర్డ్ మాజీ చైర్మన్ గఫూర్, పార్టీ నేతలు కరుటూరి వీర్రాజు, రామకుర్తి జగాలు, కాపవరపు ప్రసాద్, రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే అభివృద్ధి సాధ్యం

కిర్లంపూడి: రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని వైఎస్సార్ సీపీ జగ్గంపేట ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం కోడలు తోట శ్రీనిధి అన్నారు. మండలంలోని ముక్కొల్లులో బుధవారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి సీఎం జగన్ చేసిన అభివృద్ధిని వివరించారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి జగ్గంపేట ఎమ్మెల్యేగా తోట నరసింహాన్ని, కాకినాడ ఎంపీగా చలమలశెట్టి సునీల్‌ను గెలిపించాలని కోరారు. అనంతరం తోట నరసింహం ముక్కొల్లు చేరుకుని పార్టీ శ్రేణులతో సమీక్షించారు. కార్యక్రమంలో మండల సచివాలయాల కన్వీనర్ జోకా శ్రీను, తోట వరహాలయ్య, తోట నరేంద్ర, మేడిబోయిన నాగార్జున, విశ్వనాథం చక్రధరరావు, తోట వెంకటరమణమూర్తి, ఓలేటి రాజు, తోట అయ్యన్న తదితరులు పాల్గొన్నారు.


జగ్గంపేట ఎన్నికల ప్రచారం చేస్తున్న తోట ప్రసన్న

హాట్‌పాట్లు

- నిప్పులు కురిపిస్తున్న భానుడు
- అల్లాడిపోతున్న జనం
- నిర్మానుష్యంగా మారిన ప్రధాన రహదారులు


ప్రత్తిపాడులో ఎండ నుంచి రక్షణగా గొడుగును ఆశ్రయించిన యువతులు


రాచపల్లి అడ్డురోడ్డు వద్ద నిర్మానుష్యంగా మారిన 16 నంబర్ జాతీయరహదారి

ప్రత్తిపాడు రూరల్: ఎండలు మండిపోతున్నాయి. ఉదయం నుంచే భానుడు తన ప్రతాపం చూపుతున్నాడు. ఏప్రిల్ మొదటి వారంలోనే ఎండలు తారాస్థాయికి చేరుకున్నాయి. భారీగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో జనం బెంబేలెత్తిపోతున్నారు. ఎండ తీవ్రత, ఉక్కపోత నుంచి ఉపశమనానికి ప్రజలు ఏసీలు, కూలర్లను ఆశ్రయిస్తున్నారు. పగలు, రాత్రి ఉష్ణోగ్రతల్లో వ్యత్యాసం కూడా ఎక్కువగా ఉంటోంది. పగటి పూట 40 నుంచి 42 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఈ నెల ప్రారంభంలోనే మెట్ట ప్రాంతమైన ప్రత్తిపాడు నియోజకవర్గంలో 41 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. బుధవారం ఉదయం 10 గంటలకే ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో ప్రజలు తీవ్రం ఇబ్బందులు పడ్డారు. సాయంత్రం 6 గంటల వరకూ ఎండ తీవ్రత కొనసాగుతోంది. సాధారణ ఉష్ణోగ్రతలు కన్నా అదనంగా ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. అత్యవసర పనులు ఉంటే మినహా ఇంటి నుంచి బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. ఫలితంగా ప్రధాన కూడళ్ల, రహదారులు నిర్మానుష్యంగా దర్శనమిస్తున్నాయి. ఎండ వేడిని తట్టుకోలేక 16 నంబర్ జాతీయ రహదారిపై ప్రయాణించే వాహనదారులు రోడ్లకు ఇరువైపులా చెట్లకింద వాహనాలను నిలిపివేశారు. అత్యవసర పనులపై బయటకు వచ్చిన వారు ఎండ నుంచి రక్షణగా గొడుగులు, క్యాప్‌లు వంటి వాటిని వినియోగిస్తున్నారు. ఎండ తీవ్రత నుంచి ఉపశమనం పొందేందుకు శీతల పానీయాలను ఆశ్రయిస్తున్నారు. ఫలితంగా జ్యూస్‌లు, కొబ్బరి బొండాలు, కూల్ డ్రింక్స్ విక్రయాలు జోరందుకున్నాయి.

జాగ్రత్తలు తీసుకోవాలి

"రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. వడదెబ్బ బారిన పడకుండా ప్రజలు జాగ్రతలు తీసుకోవాలి. ఏవైనా పనులు ఉండే తప్ప ఎండలో తిరగకూడదు. అత్యవసరమైతే ఉదయం పూటనే చేసుకోవాలి. ఎండలో బయటకు వెళ్లాల్సి వస్తే కచ్చితంగా గొడుగు, టోపి ధరించాలి. రోజు కనీసం 15 గ్లాసుల నీళ్లు తాగాలి."

– ఆర్‌ఆర్ పవన్‌కుమార్, మండల వైద్యాధికారి, రాచపల్లి, ప్రత్తిపాడు మండలం

వడదెబ్బకు గురయ్యే ప్రమాదం

ప్రస్తుతం మండిపోతున్న ఎండల్లో తిరిగితే ప్రజలు వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉంది. ఎండలో ఎక్కువగా గడిపితే డీహైడ్రేషన్ (శరీరంఒ నీటి శాతం తగ్గడం), డయేరియా (విరేచనాలు) తదితర సమస్యలతో ఇబ్బంది పడే అవకాశముంది. ఎండలో ఎక్కువ సేపు పని చేస్తే చర్మం పొడి బారడం, కళ్లు ఎరుపెక్కడం, ఒళ్లు మంటలు, నొప్పులు వస్తాయి. ఒక్కోసారి అపస్మారక స్థితిలోకి వేళ్లే అవకాశం ఉంది.

వేసవితో చేయకూడని పనులు

- ఎండ తీవ్రత అధికంగా ఉంటే బయటకు వెళ్లరాదు
- రోడ్లపై విక్రయించే కలుషిత ఆహారం తినరాదు
- మాంసాహారం తగ్గించాలి
- నూనెలో వేయించిన ఆయిల్ ఫుడ్ ఎక్కువగా తినకూడదు

చేయాల్సిన పనులు

- పండ్ల రసాలు, కొబ్బెరి బొండాలు, ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి. రోజుకు కనీసం 15 గ్లాసుల నీటిని తాగాలి
- పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి
- రోజుకు రెండు పూటలా స్నానం చేయాలి
- లేత వర్ణం, తేలికైన కాటన్ దుస్తులు ధరించాలి
- తప్పనిసరి పరిస్థితుల్లో ఇంటి నుంచి బయటకు వెళితే గొడుగు తీసుకువెళ్లాలి
- చల్లని ప్రదేశంలో ఉండేందుకు ప్రయత్నించాలి

వడదెబ్బకు ప్రథమ చికిత్స ఇలా...

- వడదెబ్బ తగిలిన వ్యక్తిని వెంటనే చల్లని ప్రదేశానికి చేర్చాలి
- ఐస్ నీటిలో ముంచిన క్లాత్‌తో శరీరం బాగా తుడవాలి
- శరీరం సాధారణ ఉష్ణోగ్రతకు వచ్చే వరకూ ఇలానే చేస్తూ ఉండాలి
- ఉప్పు కలిపిన మజ్జిగ తాగించాలి, లేని పక్షంలో గ్లూకోజు ద్రావణం, లేదా ఓఆర్ఎస్ తాగించాలి
- వీలైనంత త్వరగా ఆసుపత్రికి తీసుకెళ్లాలి

వైభవంగా శ్రీపుష్పయాగం


సీతారాములకు శ్రీపుష్పయాగం నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరిపై రామాలయంలో సీతారాములకు బుధవారం శ్రీపుష్పయాగం నిర్వహించారు. శ్రీరామ నవమి వేడుకల్లో భాగంగా రాత్రి 7.30 గంటలకు నవదంపతులు సీతారాములను, పెళ్లిపెద్దలు సత్యదేవుడు, అమ్మవార్లను ప్రత్యేక సింహాసనాలపై ప్రతిష్ఠించి పండితులు విశేష పూజలు చేశారు. అనంతరం సీతారాములను పలురకాల పుష్పాలతో పూజించారు. సీతారాములకు వివిధ రకాల పిండివంటలు నివేదించారు. అనంతరం రామాలయంలో ప్రత్యేకంగా అలంకరించిన ఊయల మీద సీతారాములను పవలింపు చేసి వేద మంత్రాల నడుమ మూడుసార్లు ఊపారు. ఊయలకు అమర్చిన అద్దంలో సీతారాములను పండితులు దర్శించారు. భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. భక్తులు సీతారాములను అద్దంలో తిలకించి పులకించారు. వేద పండితులు గొల్లపల్లి ఘనపాఠీ, గంగాధరబట్ల గంగబాబు, ఉపాధ్యాయుల రమేష్, ముష్టి పురుషోత్తం, కోట సుబ్రహ్మణ్యం, సుదీర్, దత్తాత్రేయ శర్మ తదితరులు పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. కాగా శ్రీపుష్పయాగంతో రత్నగిరిపై శ్రీరామ నవమి మహోత్సవాలు ముగిశాయి.